ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 111 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 31 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు

## సబ్సిడీపై విత్తనాలు

సీఎం రేవంత్ రెడ్డి

ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యలపై సీఎంకు అందిన నివేదిక

సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక సమర్పించిన నిపుణుల కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు నివేదికలో పలు సూచనలు చేసిన నిపుణుల కమిటీ

2

## పేదల సొంతింటి కలను సాకారం



పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

# 2034 వరకు నేనే సీఎం



ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం

విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు

55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య

ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం

ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ

**హైదరాబాద్, జులై 30 (ప్రభాత ఉదయం)**

విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి" అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు ..మిగతా 2లో

# ఈ20 పెట్రోల్‌తో సమస్యలుండవు

2 నుంచి 6 శాతం మైలేజ్ తగ్గొచ్చు

మోటార్ పార్ట్స్ అరిపోవడం దుష్ప్రచారమే

ఇంజిన్ ఫెయిల్యూర్ పై ఆధారాల్లేవు

కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జులై 30 (ప్రభాత ఉదయం)**

ఈ 20 పెట్రోల్ (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) పై కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ వేదికగా దీనిపై స్పష్టత ఇచ్చింది. ఈ20 ఇంధనం వల్ల ఇంజిన్ భాగాలు అరిగిపోవడం, తుప్పు పట్టడం లేదా వాహనం కాల పరిమితి తగ్గడం వంటి సమస్యలేవీ తలెత్తడం లేదని ప్రభుత్వం సమర్థించుకుంది. ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం భారత్‌కు ఇంధన భద్రతను అందించడంతో పాటు అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి సామాన్య వినియోగదారుల్ని కాపాడుతుందని పేర్కొంది. లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నీతి ఆయోగ్, వాహన తయారుదారులు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ) , సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ ..మిగతా 2లో




# ఆ ల్యాప్ టాప్‌లో ఏముంది..?

పర్సనల్.. ప్రొఫెషనల్ లైఫ్ ఏంటీ

సోషల్ మీడియాలో మహిళలతో చాటింగ్

రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు ప్రస్తావన



**హైదరాబాద్, జులై 30 (ప్రభాత ఉదయం)**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలను ప్రస్తావించారు పోలీసులు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన, మానసిక స్థితిని రిమాండ్ రిపోర్ట్‌లో ప్రముఖంగా వివరించారు. వాస్తవానికి బాధితురాలికి ఉదయ్ జూనియర్.. గతేడాది ఇన్‌స్టాగ్రామ్‌లో ఉదయ్ కృష్ణారెడ్డికి బాధితురాలితో పరిచయం ఏర్పడింది. తన విక్టరీ జర్నీపై ఉదయ్ చేసిన పోస్ట్‌కి బాధితురాలు స్పందించింది. ఉదయ్ బ్యాగ్రౌండ్ తెలుసుకుని ..మిగతా 2లో



## టీ నుంచి టీవీ వరకు బాదుడే

సామాన్యుడుపై అధిక ధరల భారం

పశ్చిమాసియా సంక్షోభం కారణం

ముడి సరుకుల ధరలు, రవాణా వ్యయాలు పెంపు

4 నుంచి 8 శాతం వరకు ఉత్పత్తుల పెరుగుదల

**న్యూఢిల్లీ, జులై 30 (ప్రభాత ఉదయం)**

సామాన్యులకు బిగ్ షాక్ తగలనుంది. ఆగస్టు నెలలో జేబు మరింత భారంగా మారనుంది. పండగల సీజన్‌కు ముందే ధరల మోత మోగించేందుకు అన్ని ఇండస్ట్రీల కంపెనీలు సన్నద్ధమవుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం, ముడి సరుకుల ధరల పెంపు, రవాణా వ్యయాల భారంతో వచ్చే ఆగస్టు నుంచి టీ పొడి నుంచి హెయిర్ ఆయిల్, దుస్తులు, స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ..మిగతా 2లో

# ముగిసిన వాదనలు

సీఈసీ నియామకంపై సుప్రీంలో పిటీషన్

విస్తృత ధర్మాసనంకు పంపాలా వద్దా

తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం



**న్యూఢిల్లీ, జులై 30 (ప్రభాత ఉదయం)**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) నియామకానికి సంబంధించి 2023లో తెచ్చిన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై సుప్రీం కోర్టులో వాదనలు ముగిశాయి. ఈ కేసును ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనానికి పంపించాలా? వద్దా? అన్న అంశంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. సీఈసీ నియామక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తికి (సీజేఐ) స్థానం లేకపోవడంపై అభ్యంతరం తెలుపుతూ పలువురు ఈ పిటిషన్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాల కమిటీలో సీజేఐ తొలగింపును కేంద్రం సమర్థించుకుంది. సీఈసీ నియామకానికి సంబంధించి నూతన చట్టంతో ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తి దెబ్బతినదని సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రధాని ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తారని ముందే భావించడం తప్పు అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆర్టికల్ 324(2) ప్రకారం ఎన్నికల కమిషనర్ల నియామకాలపై చట్టం చేసే అధికారం పార్లమెంట్‌కు ఉందని కేంద్రం తెలిపింది. నియామక



## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

12 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు

నదీపరీవాహ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు

4

# ఈ20 పెట్రోల్‌తో సమస్యలుండవు

**మొదటి పేజీ తరువాయి...**

మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐఏఎం) , ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు (ఓఎంసీఎస్) , ఇతర సాంకేతిక సంస్థల సలహాలతో దశలవారీగా, శాస్త్రీయంగా ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్‌లు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విస్తృత ప్రయోగాలు, ఫీల్డ్ ట్రయల్స్‌లో ఈ20 ఇంధనం వాహనాలకు పూర్తి సురక్షితమని నిరూపితమైందని సురేశ్ గోపి వెల్లడించారు.

**'ఇంజిన్ విఫలమైనట్లు ఆధారాల్లేవ్'**

ఇప్పటికే దేశంలో 15 శాతం ఇథనాల్ కలిగిన ఈ150 పెట్రోల్ 3 సంవత్సరాలకుపైగా, 19-20 శాతం ఇథనాల్ కలిగిన ఈ19-ఈ20 ఇంధనం రెండున్నర సంవత్సరాలకుపైగా వినియోగంలో ఉందని ప్రభుత్వం గుర్తుచేసింది. ఈ కాలంలో 20 కోట్లకుపైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకుపైగా పెట్రోల్ కార్లు ఈ ఇంధనంతో నడిచినా, ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా ఇంజిన్ విఫలమైనట్లు ధ్రువీకరించిన ఆధారాల్లేవని తెలిపింది. ప్రభుత్వం ప్రకారం ఈ20 ఇంధనం ఎక్కువ ఆక్టేన్ వాల్యూ, మెరుగైన పనితీరు, తక్కువ కాలుష్యం వంటి ప్రయోజనాలు కలిగి ఉంది. దీంతో ఇంజిన్ మరింత సమర్థంగా పనిచేస్తుందని స్పష్టం చేసింది. ఇంకా పబ్లిక్ సెక్టార్ చమురు మార్కెటింగ్ కంపెనీలు రైతుల వద్ద ఇథనాల్‌ను మంచి మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ20 ఫ్యూయెల్ క్యాంపెయిన్ చమురు కంపెనీలకు లాభం కోసం కాకుండా ఇంధన భద్రత, ధరల్లో స్థిరత్వం, రైతుల సంక్షేమం, విదేశీ మారక నిల్వల ఆదా కోసం చేపట్టిన వ్యూహాత్మక చర్య అని తెలిపింది.




**'ఇంధన ధరల్ని పరిమితంగానే పెంచాం'**

భారతదేశం క్రూడ్ ఆయిల్ దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్నందున ఆ భారాన్ని తగ్గించుకునేందుకు దేశీయంగా ఇథనాల్ మిశ్రమం వ్యూహాత్మకంగా కూడా కీలకం అని పేర్కొంది. మరోవైపు పశ్చిమాసియా సంక్షోభ సమయంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగినా, దేశీయంగా ఇంధన ధరలు పరిమిత స్థాయిలోనే పెరిగాయని కేంద్రం తెలిపింది. 2026 ఫిబ్రవరి నుంచి క్రూడ్ ధరలు 70-80 శాతం వరకు పెరిగినా దేశీయంగా 7-8 శాతం మాత్రమే పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ముడి చమురు ధర గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు పెట్రోల్ ధర లీటరుకు రూ. 125 వరకు వెళ్లే అవకాశం ఉన్నా, ఢిల్లీలో వినియోగదారులకు రూ. 94.77 కే అందించినట్లు తెలిపింది.

**మైలేజ్ 2-6 శాతం వరకు తగ్గొచ్చు: నితిన్ గడ్కరీ**

ఇక ఈ20 పెట్రోల్ వాడితే వాహనాల మైలేజ్ 2 నుంచి 6 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో తెలిపారు. ఇది వాహనం, మోడల్‌ను బట్టి ఉంటుందన్నారు. అంతే కానీ ఈ ఇంధనం వల్ల ఇంజిన్ దెబ్బతినడం, పనితీరు తగ్గడం లేదా ఇతర సాంకేతిక లోపాలు వచ్చినట్లు ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు. ఈ20 పెట్రోల్‌తో మరింత మెరుగైన యాక్సిలరేషన్, సాఫీ రైడ్ క్వాలిటీ సహా కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.

**వందేమాతరం బిల్లు ఆమోదం**

యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం తర్వాత రోజు కూడా లోక్‌సభలో వాయిదాలపర్వం కొనసాగింది. గురువారం ఉదయం 11గంటలకు సభ సమావేశం కాగానే వివిధ అంశాలపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. వెల్‌లోకి దూసుకెళ్లి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వాలని స్పీకర్ ఓంబిర్లా కోరినప్పటికీ విపక్ష సభ్యులు నినాదాలు ఆపలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనటంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవటంతో మధ్యాహ్నం 3 గంటల వరకు మళ్లీ వాయిదావేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైన లోక్‌సభ జాతీయ గేయం 'వందేమాతరం' అవమానాన్ని నివారించే బిల్లుపై స్వల్ప చర్చ తర్వాత ఆమోదించింది. అనంతరం లోక్‌సభ శుక్రవారానికి వాయిదాపడింది.

## ఆ ల్యాప్ టాప్‌లో ఏముంది..?

**మొదటి పేజీ తరువాయి...**

సానుభూతి చూపించింది. తాను 2004 బ్యాచ్ ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యానని.. అయితే ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి ట్రైనింగ్‌లో చేరనున్నట్టు తెలిపిందామె. ఆ తర్వాత ఇద్దరు ఫోన్ నంబర్లు మార్చుకుని మాట్లాడుకోవడం మొదలెట్టారు. అదికాస్త ప్రేమకు దారితీసింది. ఎన్ పీ ఏ లో ట్రైనింగ్ తీసుకుంటున్న సమయంలో ఇద్దరి మధ్య సంబంధం మరింత బలపడింది. అయితే కొద్దిరోజులకే ఇద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. ఉదయ్ పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్ టాప్ విసిరి ధ్వంసం చేశాడు. ఆమె తనను బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా అకౌంట్లు క్రియేట్ చేశాడు. వ్యక్తిగత చాట్‌లను బయటపెడతానని బ్లాక్‌మెయిల్ చేశాడు ఉదయ్. బాధితురాలి అనుమతి లేకుండా కుటుంబసభ్యులను, ఫ్రెండ్స్‌ని కాంటాక్ట్ అయ్యాడు. టార్చర్ పెరగడంతో బాధితురాలు ఉదయ్ నుంచి దూరంగా ఉంది. ఆపై మరొకర్ని పెళ్లి చేసుకుంది. అయినా ఉదయ్ వేధింపులు ఆగలేదని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు పోలీసులు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ఉదయ్ నివాసంలో సోదాలు చేసిన పోలీసులు.. ఓ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. అభ్యాస్ ఐఏఎస్ అకాడమీని ఉదయ్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. మొత్తంగా ఉదయ్ వింత ప్రవర్తన.. పొసెసివ్ బిహేవియర్, దురుసు ప్రవర్తనతో బాధితురాలు విసిగిపోయినట్టు రిపోర్ట్‌లో పోలీసులు ప్రస్తావించారు. నిజానికి బాధితురాలికి ఉదయ్ జూనియర్. ఆమె కంటే ముందే ఉదయ్‌కి మరో ఇద్దరు అమ్మాయిలకు ప్రపోజ్ చేశాడట. వారిలో ఒకరు పెళ్లికి నిరాకరించడంతో.. బాధితురాలకి దగ్గరైనట్టు తెలుస్తోంది. ఆ తర్వాత బాధితురాలితో సన్నిహితంగా ఉంటూ వచ్చాడు. అయితే.. ఉదయ్ వింత ప్రవర్తన, పొసెసివ్ బిహేవియర్, దురుసు ప్రవర్తనతో బాధితురాలు విసిగిపోయినట్టు రిమాండ్ రిపోర్ట్‌లోఉంది. ఆ తర్వాత, తనను దూరం పెట్టడంతోనే బాధితురాలిని వేధించి ఆమెపై హత్యాయత్నం చేశాడంటూ ట్రైనీ ఐపీఎస్ పై ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అశోక్‌నగర్‌లోని ఉదయ్ నివాసంలో పోలీసులు సోదాలు చేశారు. అతడి ఇంట్లో ఒక సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఇంతేగాదు, అభ్యాస్ ఐఏఎస్ అకాడమీని ఉదయ్ నిర్వహిస్తున్నట్టు రిమాండ్ రిపోర్ట్‌లో వివరించారు పోలీసులు. అయితే.. ఉదయ్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో ఏముంది? పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌కి సంబంధించిన వివరాలు ఉన్నాయా? మరి అవి ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయో చూడాలి.



## పేదల సొంతింటి కలను సాకారం

**పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం**

**దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ**

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై30 (ప్రభాత ఉదయం)**

పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## టీ నుంచి టీవీ వరకు బాదుడే

**మొదటి పేజీ తరువాయి...**

రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, కార్లు వంటి పలు ప్రొడక్టుల ధరలు 4 శాతం నుంచి 8 శాతం వరకు పెరగనున్నాయి. ఇప్పటికే పలు కంపెనీలు ధరల పెంపును ప్రకటించాయి. మరికొన్ని కంపెనలు కూడా అదే బాటలో వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఫిబ్రవరి చివరిలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన దగ్గరనుంచి దేశీయ కంపెనీలు ఇప్పటికే రెండుసార్లు ధరలను పెంచాయి. ఇప్పుడు ఆగస్టులో 3వ విడత పెంపునకు రెడీ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువలో తీవ్ర హెచ్చుతగ్గులు, ముడి చమురు, ఇతర కమోడిటీల ధరల పెంపుతో ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగిందని కంపెనీలు అంటున్నాయి. ఈ భారాన్ని పూర్తిగా భరించడం సాధ్యం కాదని, ధరల పెంపు అనివార్యమని ఇండస్ట్రీ వర్గాలు చెప్పకనే చెప్పేశాయి.

**భారీగా పెరగనున్న కార్ల ధరలు :**

ఆగస్టు నుంచి కార్ల ధరలు కూడా భారీగా పెరగనున్నాయి. మారుతి సుజుకీ కారు మోడళ్లను బట్టి రూ.30 వేల వరకు ధరలు పెంచనున్నట్లు ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మారుతి కంపెనీ తమ కార్ల ధరలు పెంచడం ఇది సెకండ్ టైమ్.. మరోవైపు హోండా కూడా ఆగస్టు 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నట్టు వెల్లడించింది. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఈ నెలలోనే ధరలు భారీగా పెంచేశాయి. లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా 4 శాతం వరకు ధరలు పెంచేసింది. డాలర్-రూపాయి మారకం రేటును బట్టి మరోసారి పెంపు తప్పదని సంకేతాలిచ్చింది.

**ఎఫ్ఎంసీజీ కంపెనీలపై భారం :**

హెయిర్ ఆయిల్, టీ వంటి నిత్యావసర వినియోగ వస్తువుల తయారీ కంపెనీలు కూడా ముడి పదార్థాల ధరల పెంపుతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా పెట్రోలియం ఆధారిత ముడి పదార్థాలు, ఆవనూనె, బాదం నూనె వంటి ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో ఉత్పత్తి వ్యయం మరింత భారంగా మారిందని కంపెనీలు చెబుతున్నమాట. జూన్ త్రైమాసిక ఫలితాల సందర్భంగా టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, బజాజ్ కన్స్యూమర్ కేర్, హెచ్‌యూఎల్ వంటి సంస్థలు కూడా సెప్టెంబరు త్రైమాసికంలో ధరలను భారీగా పెంచనున్నట్టు సంకేతాలిచ్చాయి. ఇప్పటికే 2 శాతం నుంచి 5 శాతం వరకు ధరలు పెంచిన హెచ్‌యూఎల్, పెరిగిన వ్యయాన్ని బ్యాలెన్స్ చేసేందుకు మరోసారి ధరల పెంపు తప్పదని చెప్పేసింది.

**టీవీలు, ఫ్రిజ్‌లు, ఫోన్ల ధరల పెంపు :**

ఎలక్ట్రానిక్స్ రంగంలో కూడా ధరల పెంపు తప్పదు. ఆగస్టులో టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు 4 శాతం నుంచి 6 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఇండస్ట్రీ అంచనా వేస్తోంది. మెమొరీ చిప్‌ల కొరత, ధరలు గత కొన్ని నెలల్లో 3 రెట్లు పెరిగాయి. దాంతో స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దుస్తుల తయారీ కంపెనీలు సైతం పెరిగిన ఉత్పత్తి వ్యయంతో ధరల పెంపునకు రెడీ అవుతున్నాయి.

**వినియోగదారులకు బిగ్ షాక్ :**

పండగల సీజన్‌లో వినియోగదారులు ఎక్కువగా కొనుగోళ్లు చేస్తుంటారు. ఈ ధరల పెంపు నేరుగా సామాన్యుల జేబుపై ప్రభావం పడనుంది. టీ పొడి నుంచి టీవీ వరకు మొబైల్ నుంచి కారు వరకు దాదాపు అన్ని విభాగాల్లో ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు నెల సామాన్యులకు ఖర్చులతో మరింత భారంగా మారనుంది



## ముగిసిన వాదనలు

**మొదటి పేజీ తరువాయి...**

కమిటీలో సీజేఐ తప్పనిసరిగా ఉండాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని పేర్కొంది. కమిషనర్ల పదవీ భద్రతే ఈసీ స్వయంప్రతిపత్తికి మూలస్తంభం అని కేంద్రం అభిప్రాయపడింది. పిటిషనర్ల తరఫున లాయర్ ప్రశాంత్ భూషణ్ మట్లాడుతూ నియామక కమిటీ నుంచి సీజేఐని తొలగించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని అన్నారు. న్యాయం జరగడమే కాదు, అది పారదర్శకంగా ఉన్నట్లు ప్రజలకు కనిపించాలని విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. 2023 నాటి చట్టం ప్రకారం, సెలక్షన్ కమిటీలో ప్రధాన మంత్రితో పాటు ప్రధాని నామినేట్ చేసిన మరో మంత్రి, ప్రతిపక్ష నేత లేదా లోక్‌సభలో అత్యధిక సీట్లు సాధించిన పార్టీ లీడర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలో ప్రధాన న్యాయమూర్తికి చోటు లేకపోవడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రీఫార్మ్స్ తదితరులు పిల్స్‌ను దాఖలు చేశారు.



## కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు

**హైదరాబాద్, జులై 30 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. సుమారు రూ.803కోట్ల రూపాయలతో కార్యచరణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించినట్లు కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు.

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు : విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రభుత్వానికి నిపుణుల కమిటీ సూచనలు : రాష్ట్రంలో ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించిన కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని కమిటీ తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించింది. గ్రామాల వారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. ఈ పంటలకు 75శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.

గతేడాది ఈ సీజన్‌లో 79.49 లక్షల ఎకరాలు సాగు చేయగా ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయని నిపుణుల కమిటీ తెలిపింది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3 లక్షల 62 వేల ఎకరాలు, వరి 14 లక్షల 92 వేల ఎకరాల్లో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో పేర్కొంది. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. సబ్సిడీ విత్తనాలు ఇచ్చి పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది.

**మరికొన్ని కీలక ప్రతిపాదనలు ఇవే :**

హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించాలి
రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలి
గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లు స్థాపించేందుకు ఆర్థికసాయం చేయాలి
అత్యవసర చర్యల అమలు పర్యవేక్షణకు గ్రామస్థాయి బృందాలు ఏర్పాటు చేయాలి
వీబీజీ రామ్‌జీ ద్వారా చెక్‌డ్యాంలు, ఫార్మ్ పాండ్లు, చెరువుల పూడికతీత, వర్షపునీటి సంరక్షణ
నీటి వనరులు బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించాలి
మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి
జలాశయాల్లో నీటిని సమర్థవంతంగా వినియోగించాలి
సేంద్రీయ, జీవ ఎరువల వినియోగం ప్రోత్సహించడం
వర్మీకంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు

కార్యచరణ ప్రణాళిక అమలుకు రూ.800 కోట్లు అవసరం : పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. కార్యాచరణ ప్రణాళిక అమలుకోసం సుమారు 803 కోట్ల నిధులు అవసరమవుతాయని కమిటీ అంచనా వేసింది. మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని నిపుణుల కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమ, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.





## 2034 వరకు నేనే సీఎం

**మొదటి పేజీ తరువాయి...**

తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

# వినాయక చవితి, నిమజ్జనోత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలి

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్... గణేష్ నిమజ్జనోత్సవాలపై కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ స్థాయి సమావేశం



వినాయక ఉత్సవాల ఏర్పాట్ల పై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

**బుద్వేల్ , జూలై 30 (ప్రభాత ఉదయం) :**

సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి మొదలుకొని సెప్టెంబర్ 25వ తేదీ అనంత చతుర్దశి రోజు వరకు జరిగే వినాయక నిమజ్జనోత్సవాల కు అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు టి ప్రకాష్ గౌడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గణేష్ నిమజ్జనోత్సవాలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వినాయక నిమజ్జనం ఊరేగింపు జరిగే అన్ని రహదారులను బాగు చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపు జరిగే ప్రాంతాలలో అడ్డంగా కరెంటు వైర్లు, చెట్లు ఉంటే వాటిని సరి చేసే విధంగా విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన లో వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కృషితో హనుమాన్ నగర్ పత్తికుంట ( వినాయక సాగర్ ) లో రాబోయే రోజుల్లో అందంగా తీర్చిదిద్దడానికి, వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు జరుగుతాయన్నారు. మండపాల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలకుండా ఊరేగింపు చేయాలన్నారు. పత్తి కుంట, పల్లె చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్, అత్తాపూర్, కిస్మత్ పూర్ , బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, పాతబస్తీలోని ప్రాంతాలన్నిటిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అందుకోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు. బాలాపూర్ గణేష్ నిమజ్జన ర్యాలీ రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పాతబస్తీ రోడ్ల గూండా వెళ్తున్న నేపథ్యంలో ఆ రహదారులను కూడా బాగు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి శాంతియుతంగా నిమజ్జనోత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం మీరాలం చెరువు వద్ద పనులు జరుగుతున్నందువల్ల అక్కడ నిమజ్జనాలు ఉండవన్నారు.

**మండపాల నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి : రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ :**

వినాయక మండపాలు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని, అలా చేసినట్లయితే బందోబస్తుకు ఇబ్బందులు ఉండవన్నారు. వినాయక చవితి, నవరాత్రులు, నిమజ్జోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండపాల వద్ద అనుమానితులు ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

**అనుమతుల పేరిట ఇబ్బందులు పెట్టవద్దు : శశిధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి :**

అనుమతుల పేరిట మండపాల నిర్వాహకులను ఇబ్బందులు పెట్టవద్దని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ అన్నారు . అనుమతులు అనే దాని బదులు ఇంటిమేషన్ ఇస్తే చాలు అని అంటే బాగుంటుందన్నారు. గణేష్ నిమజ్జోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.

**కిస్మత్ పూర్, పీరం చెరువు ప్రాంతాలలో నిమజ్జన పాయింట్లను పెట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలి : మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్**

కిస్మత్ పూర్ , పీరం చెరువు ప్రాంతాలలో నీటి సౌకర్యం ఉన్నచోట నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేసి క్రేన్ , విద్యుత్, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్, గోకరి సురేష్ గౌడ్ లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

**హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను వన్ వే గా పోనివ్వాలి: వై శ్రీధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్**

హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను కుడివైపు రోడ్డు గుండా వన్వే లో వెళ్ళేటట్లు చూడాలన్నాని భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్ కోరారు. పత్తికుంట వైపు ఉన్న రోడ్డులో కేవలం వినాయక నిమజ్జనోత్సవాల వాహనాలకే ఉపయోగించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు జరిగే ప్రాంతాలలో ముందుగానే ఏర్పాట్లు చేయాలన్నారు.

**కరెంటు తీగెలను సరి చేయాలి : ఎం ప్రభాకర్ రెడ్డి, శివరాంపల్లి**

శివరాంపల్లి పెద్ద వినాయకుడు ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లడం జరుగుతుందని, కరెంటు తీగలను విద్యుత్ అధికారులు సరిచేయాలని ఆ బస్తీకి చెందిన ఎం ప్రభాకర్ రెడ్డి కోరారు . గత సంవత్సరం విద్యుత్ వైర్లు తగడం తగలడం వల్ల చాలా ఇబ్బందులు కలగాయన్నారు. గడచిన 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నాయకత్వంలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఇంద్ర పాల్ రెడ్డి అన్నారు. ఈ సంవత్సరం కూడా అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్ , కార్యదర్శి కె మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ మల్లారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్, రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ రత్నాకర్ రావు, రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ, జీహెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సత్యనారాయణ రెడ్డి, నాయకులు ఎన్ ధనుంజయ, జోగి రవి తదితరులు పాల్గొన్నారు.



## టోల్ గేట్ రుసుము చెల్లించమంటే దాడి

**బుద్వేల్, జూలై 30 (ప్రభాత ఉదయం)**

కారులో ఔటర్ రింగ్ రోడ్డు టోల్ గేట్ వద్దకు వచ్చిన వారు టోల్ గేట్ రుసుము చెల్లించమంటే ఘర్షణకు దిగి సిబ్బందిపై దాడి చేశారు.దాడిలో గాయపడ్డ టోల్ గేట్ సిబ్బంది రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ ప్రాంతానికి చెందిన సతీష్, రాకేష్,రాజేష్ లో బుధవారం రాత్రి తమ కారులో ఔటర్ రింగ్ రోడ్ పైనుండి వస్తూ ఎగ్జిట్ నంబర్ 17 వద్ద దిగేందుకు సిద్ధమయ్యారు. టోల్ గేట్ వద్దకు రాగానే కారుకు ఫస్ట్ టాగ్ లేకపోవడం సిబ్బంది డబ్బు చెల్లించాలని కోరారు. తమ వద్ద డబ్బు లేదని యువకులు టోల్ గేట్ డ్యూటీలో ఉన్న సందీప్ తో వాగ్వివాదానికి దిగారు. మాటా మాటా పెరిగి ముగ్గురు యువకులు సందీప్ పై దాడి చేశారు. దీంతో టోల్ గేట్ సిబ్బంది రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు. గాయపడ్డ సందీప్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు పల్నాటి యాదయ్య

## బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

### బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్

**బుద్వేల్,జులై30(ప్రభాత ఉదయం)**

బీసీ హక్కుల సాధన సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశం గురువారం రాజేంద్రనగర్ మండల కార్యాలయంలోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ కార్యదర్శి,తెలంగాణ రాష్ట్ర నియంత్రణ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సమావేశానికి రాజేంద్రనగర్ మండల ఇన్‌చార్జి జే.ఆనంద్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పల్నాటి యాదయ్య,పుస్తకాల నర్సింగ్‌రావు,లు మాట్లాడుతూ..స్థానిక సంస్థలు,శాసనసభ, పార్లమెంటులో బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రతి ఆర్థిక సంవత్సరంలో వార్షిక బడ్జెట్‌లో 50శాతం నిధులను బీసీల సంక్షేమానికి కేటాయించాలని కోరారు.ఆర్థికంగా బలహీన వర్గాల రిజర్వేషన్లను పునఃపరిశీలించాలని,తక్కువ జనాభా ఉన్న వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల బీసీలు నష్టపోతున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నియామకాలకు సంబంధించిన 29వ ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయాలని,మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50శాతం ఉపకోటా కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీలను ఎన్నుకున్నారు.రాజేంద్రనగర్ మండల గౌరవ అధ్యక్షుడిగా జే ఆనంద్ గౌడ్,అధ్యక్షుడిగా జే సదానంద గౌడ్,ఉపాధ్యక్షుడిగా గుజ్జరి శ్రీరాములు,ప్రధాన కార్యదర్శిగా కె మనోజ్,సహాయ కార్యదర్శిగా కె మౌనికతో పాటు15మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో.. గండిపేట్ మండల అధ్యక్షుడిగా ఆర్ శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా ఎం గోపాల్‌తో పాటు 11మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.శంషాబాద్ మండల అధ్యక్షుడిగా డి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా కావలి మల్లేష్‌తో పాటు 11మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ శంషాబాద్ కార్యదర్శి నరగిరి,గండిపేట్ కార్యదర్శి మల్లేష్,రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జే. విజయ్ ఆనంద్ గౌడ్,భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు,రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కన్యగారి లక్ష్మి,రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునేశ్వరి,కార్యాలయ కార్యదర్శి జి సత్యం,గంగారం,శాలిని,జ్యోతి,మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాల మహోత్సవాలకు సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలను ఆహ్వానించిన బాబు రెడ్డి నగర్ నాయకులు

**రాజేంద్రనగర్,జులై30(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఆగస్టు 2న నిర్వహించనున్న ఆషాఢమాస బోనాల మహోత్సవాలకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి,ని బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు,బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. బోనాల మహోత్సవాలకు ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ...బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహత్తర ఆధ్యాత్మిక,సాంస్కృతిక ఉత్సవమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు



అందించాలని పిలుపునిచ్చారు.పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... అమ్మవారి అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు,ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బోనాల మహోత్సవాలకు తప్పకుండా హాజరై ఉత్సవాల విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా అత్యంత వైభవంగా ఉత్సవాలను



నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాఘవేందర్ యాదవ్,మైసిరెడ్డి,క్రాంతి,మహేందర్, శాంతిరాజ్, అఖిల్, నిఖిల్,నితిన్,చిరు,పవన్,అనిల్,చిన్న,కున్ని,సోను,బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు,పార్టీ కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యానరంగ అభివృద్ధి కోసం అమెరికాలోని ఫ్లోరిడా విశ్వ విద్యాలయం, ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేయనున్న తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం..

### వైస్ ఛాన్సలర్ డి.రాజిరెడ్డి

**రాజేంద్రనగర్,జులై30(ప్రభాత ఉదయం)**

శ్రీకొండ లక్ష్మణ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం ఉద్యాన విద్య,పరిశోధన సుస్థిర అభివృద్ధిలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసే దిశగా కీలక చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా వైస్ ఛాన్సలర్ డా.డి.రాజిరెడ్డి అధ్యక్షతన అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా. విజయ గోపాల్ కకాని,ప్రపంచ బ్యాంకు ఫుడ్ అండ్ అగ్రికల్చర్ గ్లోబల్ ప్రాక్టీస్ సీనియర్ అగ్రిబిజినెస్ స్పెషలిస్ట్ ఆదర్శ్ కుమార్,తెలంగాణ ప్రభుత్వ ఉద్యానవనశాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషాలతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.డి. రాజిరెడ్డి,ఉద్యాన రంగంలో విద్యానైపుణ్యం, పరిశోధన ఆవిష్కరణలు,సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, సామర్థ్య నిర్మాణాన్ని పెంపొందించే వ్యూహాత్మక అంతర్జాతీయ భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడానికి విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని చెప్పారు.అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా.విజయ గోపాల్ కకాని,ఫ్లోరిడా విశ్వవిద్యాలయం,ఉద్యాన విశ్వ విద్యాలయం మధ్య సహకారానికి గల అవకాశాలను వివరించారు.ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు, అధ్యాపకులు,విద్యార్థుల మార్పిడి,సహకార విద్యా కార్యక్రమాలు,మెటీరియల్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ల (ఎం.టి.ఎ.) ద్వారా జన్యు పదార్థాల మార్పిడి, వాతావరణ మార్పులను తట్టుకోగల ఉద్యాన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి,పరస్పర



ఆసక్తి ఉన్న రంగాలలో శాస్త్రీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి.విద్యార్థులు, పరిశోధకులు,ఉద్యాన రంగం ప్రయోజనం కోసం అత్యాధునిక పరిశోధన,విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో కలిసి పనిచేయడానికి ఇరు సంస్థలు తమ సుముఖతను వ్యక్తం చేశాయి. తరువాత జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో,ప్రపంచ బ్యాంకు ఫుడ్ అండ్ అగ్రికల్చర్ గ్లోబల్ ప్రాక్టీస్ సీనియర్ అగ్రిబిజినెస్ స్పెషలిస్ట్ ఆదర్శ్ కుమార్, తెలంగాణలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంకు నుండి ఆర్థిక సహాయాన్ని సమీకరించే అవకాశాలపై చర్చించారు.ఉద్యాన విపణి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం,ఎగుమతి ఆధారిత క్లస్టర్లను ఏర్పాటు చేయడం,పంటకోత అనంతర నిర్వహణ మౌలిక సదుపాయాలు,గిడ్డంగులు,కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, లాజిస్టిక్స్,రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఇంకా రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో సన్నిహితంగా పనిచేయడం ద్వారా మార్కెట్ అనుసంధానాలను మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి.విలువ జోడింపును మెరుగుపరచడం,పంటకోత అనంతర నష్టాలను తగ్గించడం,రైతుల ఆదాయాన్ని పెంచడం,ఇంకా తెలంగాణ ఉద్యానవన ఉత్పత్తుల ప్రపంచ పోటీతత్వాన్ని పెంచడం వంటివి చేస్తాయని అన్నారు.ఈ సమావేశానికి రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్,ప్రణాళిక,పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ డాక్టర్ అనితాకుమారి,ప్రొఫెసర్లు హాజరయ్యారు.



## నేడు డయల్ యువర్ డీఎం

**రాజేంద్రనగర్, జూలై 30 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్ర నగర్ పరిసర ప్రాంత ప్రజలకు, కాలనివాసులకు తెలియజేయునది ఈ నెల 30న గురువారం 11 గంటల నుండి 12 గంటల వరకు రాజేంద్ర నగర్ డిపో యందు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బి కృష్ణా రెడ్డి సెల్ నెంబర్.9959226135 పాల్గొంటారు. రాజేంద్ర నగర్ పరిసర ప్రాంత ప్రజలు, వివిధ కాలనీల వాసులు ఈ కార్యక్రమం లో పాల్గొని తమ విలువైన సూచనలు మరియు సలహాలు తెలియజేయగలరు.

### క్రీడా స్ఫూర్తితోనే శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం..

# 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ

**ఘనంగా ముగిసిన 'ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్--2026.. ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన ఎస్డీఆర్ఎఫ్ జట్టు**

**శేరిలింగంపల్లి , జూలై30 (ప్రభాత ఉదయం)**



విజేతలు బహుమతి అందిస్తున్న కమాండెంట్ ఇతల అధికారులు..

పోలీస్ విధుల్లో ఎదురయ్యే మానసిక శారీరక ఒత్తిళ్లను అధిగమించడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ పిలుపునిచ్చారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ మైదానంలో గత మూడు రోజులుగా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన 'ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్--2026' ముగింపు వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. కమాండెంట్ ఎం. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశంలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విభాగాలు సిబ్బందికి ట్రోఫీలు ప్రశంసాపత్రాలు అందజేశారు. అదనపు డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ కంపెనీల సిబ్బంది ఎంతో క్రమశిక్షణ, ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో సర్వతోముఖ ప్రతిభను కనబరిచిన ఎస్‌డిఆర్ఎఫ్ విభాగం ఆల్ రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. విజేత జట్టుకు వింగ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. రాంబాబుతో కలిసి కమాండెంట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ రోజువారీ కఠినమైన విధి నిర్వహణలో క్రీడలు ఒక సంజీవనిలా పనిచేస్తాయని తెలిపారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, సిబ్బంది మధ్య సమైక్యత, జట్టు భావన పెరుగుతాయని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటముల కంటే భాగస్వామ్యం, క్రీడా స్ఫూర్తి ముఖ్యమని పేర్కొన్నారు. అంతకుముందు, వివిధ కంపెనీలకు చెందిన కంటింజెంట్లు నిర్వహించిన కవాతు (మార్చ్ ఫాస్ట్) ఎంతగానో ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్లు వి. అనిల్ కుమార్, డి. సత్యనారాయణ, డి. నరేందర్ రెడ్డి, ఎస్. రాంబాబులతో పాటు ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డులు, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



### వర్షాకాలంలో ప్రజలకు

# ఇబ్బందులు కలగొద్దు

**క్షేత్రస్థాయి పరిశీలనలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్**

**వాటర్‌లాగింగ్ పాయింట్లకు శాశ్వత పరిష్కారం.. అధికారులకు సీపీ కీలక ఆదేశాలు**

**మల్కంచెరువు సీఓడీ పైప్‌లైన్ పనుల పురోగతి పరిశీలించి.. ట్రాఫిక్ మళ్లింపులపై ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచన**

**శేరిలింగంపల్లి : జూలై 30 (ప్రభాత ఉదయం)**

వర్షాకాలంలో ప్రజలకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీహెచ్ఎంసీ, హైడ్రా తదితర సివిక్ బాడీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కంచెరువు వాటర్‌లాగింగ్ పాయింట్, సిటీ వైన్స్ తో పాటు, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ (సీఓడీ) పైప్‌లైన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వాటర్‌లాగింగ్ సమస్యలకు గల కారణాలను అధికారులు సీపీకి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన, వర్షపు నీరు ఎక్కడా నిలిచిపోకుండా వేగంగా వెళ్లేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న అంశాలను తొలగించి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే సీఓడీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తూనే, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ పర్యటనలో సైబరాబాద్ జాయింట్ సిపీ సన్ ప్రీత్ సింగ్, సీఎంసీ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంసీ డిప్యూటీ కమిషనర్, ఏఈఈ అధికారులు, హైడ్రా సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

**12 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు**

**నదీపరిహార ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 30(ప్రభాత ఉదయం)**

మహారాష్ట్ర, కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు కర్ణాటక జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వరద కృష్ణమ్మా పరవళ్లు తొక్కుతోంది. దీంతో కర్ణాటకు జలాశయాల నుంచి భారీగా వరద నీరు జూరాల జలాశయానికి అక్కడి అధికారులు విడుదల చేస్తున్నారు. ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 129.72 టిఎంసిలకుగాను 117.080 టీఎంసీలు ఉండగా, రిజర్వాయర్‌కు 83,386 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దిగువకు 1.10లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయంలో 33.313 టీఎంసీలకుగాను 30.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 95వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తున్న నేపథ్యంలో డ్యాం గేట్ల ద్వారా 1.10లక్షల క్యూసెక్కుల కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రానికి కర్ణాటక జలాశయాల నుంచి జూరాలకు 94,733 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో జూరాల 12 గేట్ల తెరిచి దిగువకు 47,196 క్యూసెక్కులు నీటిని వదిలారు. విద్యుదుత్పత్తికి 38,225 క్యూసెక్కులు, కుడి,ఎడమ, సమాంతర కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేస్తుండగా.. మొత్తం 89,799 క్యూసెక్కులు అవుట్‌ఫ్లోగా నమోదైంది. డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.663 టీఎంసీల నిల్వలు ఉన్నట్లు జూరాల అధికారులు తెలిపారు. జూరాల కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో జూరాల అధికారులు అప్రమతమై ప్రాజెక్టు కు వస్తున్న వరదను అలాగే దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా మరో వారం రోజుల పాటు వరద ప్రవాహం ఇలాగే కొనసాగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో లోతట్టు,నదీపరిహార ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### రైతులు పంటల ఎంపికలో

# అప్రమత్తంగా ఉండాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 30(ప్రభాత ఉదయం)**



ప్రస్తుతం ఉపరితల వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు వరి సాగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని, నీటి లభ్యత తక్కువగా ఉండే చోట ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. బోర్లు, బావులు, ఇతర వనరుల ద్వారా పంట కాలమంతా భరోసా కలిగిన నీటి లభ్యత ఉన్న రైతులు మాత్రమే వరి సాగు చేపట్టాలని తెలిపారు.తగినంత నీటి వనరులు లేని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చున్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటలను నిర్మించుకోవాలని, ఫలితంగా వర్షాలు మందగించినప్పుడు నీటి కుంటల్లో నిలువ చేసుకున్న నీళ్లను పంటలకు పారించుకోవచ్చున్నారు. జిల్లాలో కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలను అనుసరించి పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



### విద్యార్థులకు సాంకేతిక

# విద్య పరిజ్ఞానం ఎంతో అవసరం

**జాయ్ స్కూల్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి**

**జాయ్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి ఉచిత ప్రైమ్ నోట్‌బుక్ (ల్యాప్‌టాప్) పంపిణీ**

**పటాన్ చెరు జూలై 30 (ప్రభాత ఉదయం) :**

విద్యార్థులకు నాణ్యమైన, సాంకేతిక ఆధారిత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో జాయ్ స్కూల్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పాఠశాల ఛైర్మన్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రైమ్ నోట్‌బుక్ (ల్యాప్‌టాప్) ను పూర్తిగా ఉచితంగా అందజేసినట్లు ఆయన చెప్పారు.విద్యార్థులు డిజిటల్ యుగానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, స్వయంగా నేర్చుకునే అలవాటును పెంపొందించుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా జాయ్ స్కూల్ ఛైర్మన్ కె. ప్రసాద్ రెడ్డి, వ్యవస్థాపక నిర్వాహకులు ఓ. సతీష్ కుమార్ , డైరెక్టర్ స్మిత భోగరాజు, ప్రిన్సిపల్ దాక్షాయణి విద్యార్థులకు స్వయంగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ ప్రైమ్ నోట్‌బుక్‌లలో టాటా స్టడీ ఆధారిత విద్యా సంబంధిత డిజిటల్ కంటెంట్ ముందుగానే పొందుపరచబడిందని, విద్యార్థులు విద్యా అవసరాలకు మాత్రమే వినియోగించేలా ప్రత్యేక భద్రతా పరిమితులు ఏర్పాటు చేయడం ద్వారా సురక్షితమైన మరియు క్రమబద్ధమైన డిజిటల్ అభ్యాస వాతావరణాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఛైర్మన్ కె. ప్రసాద్ రెడ్డి గ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించడంతో పాటు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడం జాయ్ స్కూల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నిర్వాహకులు ఓ. సతీష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గదికి మాత్రమే పరిమితం కాకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా నేర్చుకునే అవకాశాలను కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులు కూడా ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందిస్తూ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించడం బొల్లారం ప్రాంతంలోనే కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థల్లో అరుదైన నిర్ణయమని ప్రశంసించారు. అత్యాధునిక విద్యా సౌకర్యాలు, డిజిటల్ లెర్నింగ్, సురక్షిత సాంకేతిక వినియోగం మరియు విద్యార్థుల సమగ్ర వికాసానికి కట్టుబడి ఉన్న జాయ్ స్కూల్, భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు వేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయండి





**బల్దియా పరిధిలో పటాన్చెరును ప్రథమ స్థానంలో నిలుపుదాం**

**మన ఓటు.. మన హక్కు..**

**పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు జూలై 30 (ప్రభాత ఉదయం) :**

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగియడానికి మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని ఎస్ఐఆర్ లో తమ ఓటు వివరాలు నమోదు చేయించుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ లో పాల్గొని పూర్తి వివరాలు అందించాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పటాన్ చెరు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని.. ప్రతి ఓటుకు దేశం, రాష్ట్రం, నియోజకవర్గ అభివృద్ధి నిర్ణయించే శక్తి ఉంటుందని అన్నారు. గురువారం పటాన్ చెరు పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో నియోజకవర్గస్థాయి ముస్లింలు, క్రిస్టియన్లు, మిల్లర్స్, సెంట్రింగ్ అసోసియేషన్ సభ్యులకు ఎస్ ఐ ఆర్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నలభై రోజులుగా ఎస్ఐఆర్ అంశంపై నియోజకవర్గ వ్యాప్తంగా సమావేశాలు, సదస్సులతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జూలై 30వ తేదీ ఉదయం పది గంటల వరకు నియోజకవర్గం వ్యాప్తంగా 63.27 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని తెలిపారు. బి ఎల్ వోల ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. తిరిగి ఇవ్వకుండా ఉన్న ప్రతి ఓటరు వెంటనే వాటిని సమర్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన బలమైన ఆయుధం ఓటు హక్కు అని.. దీనిని నిర్లక్ష్యం చేయడం అంటే మన బంగారు భవిష్యత్తును చీకటిమయం చేసుకోవడమేనని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఓటు అత్యంత కీలకమని.. స్థానికంగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని.. నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ప్రార్థన స్థలాలలో రాబోయే నాలుగు రోజులపాటు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మత, కుల సంఘాల పెద్దలు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య లక్ష్యం

## విదేశీ పర్యటనకు ఆగస్టు 7 వరకు జిల్లా స్థాయిలో నామినేషన్ ప్రక్రియ

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 30 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావ్యవస్థ ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం టీచర్స్ ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంను చేపట్టిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం హైదరాబాదులోని ఎంసిహెచ్ఆర్డి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ ఏడాది ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యావ్యవస్థ అధ్యయనానికి వెళ్లి వచ్చిన బృందంతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యా శాఖ జిల్లాల అధికారులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొనగా జోగులాంబ గద్వాల జిల్లా నుంచి కలెక్టర్ తో పాటు డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి మైఖేల్, ఉపాధ్యాయులు అగస్టీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రెండో విడత విద్యావ్యవస్థ అధ్యయనానికి సింగపూర్, వియత్నం, చైనా, జపాన్, ఫిన్లాండ్ దేశాలకు మరో బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. మన దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని సమాజంలో సమూల మార్పులు తీసుకురావడానికి విద్య దోహదపడుతుందన్నట్లు చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రాబోయే ఐదేళ్లలో విద్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఒక విజన్ తో ముందుకెళ్లాలన్నారు. విద్య, నైపుణ్య అభివృద్ధితోనే యువత భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. అందుకే ప్రతి నియోజకవర్గంలో





తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా పాఠశాలలను ప్రారంభిస్తున్నామన్నారు. ఇంటరాక్షన్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యా విధానాలను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “టీచర్స్ ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం -- ఫేజ్-××” కింద జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను నామినేషన్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టీచర్స్ ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం ఫేజ్-×లో భాగంగా ఏప్రిల్ 20 నుంచి 24,2026 వరకు తెలంగాణకు చెందిన ఉపాధ్యాయులతో పాటు తాను కూడా ఫిన్లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనలో పాల్గొన్నట్లు తెలిపారు. అక్కడి ప్రపంచ స్థాయి విద్యా విధానాలు, విద్యార్థి కేంద్రిత బోధన, పాఠశాల నిర్వహణలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. ఆ అనుభవాలు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. అదే విధంగా ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో ఫేజ్-××లో భాగంగా ఫిన్లాండ్,సింగపూర్, జపాన్,వియత్నాం,చైనా దేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 190 మంది ఉత్తమ ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులను పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను నామినేషన్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. వీరిలో ప్రిన్సిపల్/జీహెచ్ఎం కేడర్ నుంచి ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్/పీజీటీ లేదా సమాన కేడర్ నుంచి ఇద్దరు, ఎస్‌జీటీ/టీజీటీ లేదా సమాన కేడర్ నుంచి ఇద్దరు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇద్దరు పురుషులు,నలుగురు మహిళలు ఉండేలా ఎంపిక చేపట్టడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, అదనపు కలెక్టర్,జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ నామినేట్ చేసే ఒక అధికారి సభ్యులుగా ఉన్న జిల్లా స్థాయి కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారినే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఎంపికకు అర్హులైన అభ్యర్థులు 2026 ఆగస్టు 1 నాటికి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని,కనీసం 10 సంవత్సరాల సేవా అనుభవం ఉండాలని, ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో 100 మందికి తగ్గకుండా విద్యార్థులు ఉండాలని, ఎలాంటి శాఖాపరమైన విచారణలు, చార్జ్‌షీట్లు లేదా క్రిమినల్ కేసులు ఉండకూడదని, విదేశీ పర్యటనకు అనుకూలమైన ఆరోగ్య పరిస్థితి కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికలో గత మూడు సంవత్సరాల పనితీరును సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, పాఠశాల నమోదు పెంపు, డ్రాప్‌అవుట్‌ల తగ్గింపు, వినూత్న బోధనా విధానాలు, డిజిటల్ టెక్నాలజీ వినియోగం, పాఠశాల అభివృద్ధిలో చేసిన సేవలు, కమ్యూనిటీ భాగస్వామ్యం, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌గా సేవలు,రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు, పరిశోధన, ఈ-కంటెంట్ రూపకల్పన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, అంతర్జాతీయ విద్యా విధానాలపై అవగాహన వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారినే ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులందరి అర్హతలను పూర్తి పత్రాధారాలతో జిల్లా స్థాయిలో ధృవీకరించి, ఆగస్టు 7, 2026లోపు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, అనంతరం రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ తుది ఎంపిక చేపడుతుందని తెలిపారు. విదేశీ విద్యా అధ్యయన పర్యటన ద్వారా పొందిన అనుభవాలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసి విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ఎంపికయ్యే ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న జెన్-జీ ఉద్యమాలు

(హెచ్.ప్రతాప్)

**భారతదేశంలో నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ వివాదం కేవలం పరీక్షా నిర్వహణలో జరిగిన లోపానికి పరిమితం కాలేదు. దేశ విద్యా వ్యవస్థపై కోట్లాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన విశ్వాసానికి ఎదురుదెబ్బగా మారింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే జాతీయ స్థాయి పరీక్షలో అక్రమాల ఆరోపణలు వెలుగులోకి రావడం, విచారణ ప్రక్రియలో ఏర్పడిన సందిగ్ధత, పరీక్షను రద్దు చేయాలా లేదా మళ్లీ నిర్వహించాలా అనే అంశాలపై నెలకొన్న అనిశ్చితి దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఢిల్లీతో ప్రారంభమైన నిరసనలు బీహార్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళతో పాటు పలు రాష్ట్రాలకు విస్తరించాయి. పరీక్షల పారదర్శకత, బాధ్యతాయుతమైన పరిపాలన, స్వతంత్ర విచారణ, వ్యవస్థలో సంస్కరణలను కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు గళమెత్తాయి.**



ఈ వివాదం ఒక కీలక వాస్తవాన్ని గుర్తుచేసింది. నేటి యువతకు పరీక్షలు కేవలం మార్కులు లేదా ర్యాంకుల పోటీ మాత్రమే కావు; అవి జీవితాన్ని మార్చే అవకాశాల ద్వారం. ఆ అవకాశాలపై అనుమానం ఏర్పడితే అది ఒక విద్యా సమస్యగా కాకుండా, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పరిపాలనా బాధ్యత వంటి విస్తృత అంశాలుగా రూపాంతరం చెందుతుంది. పెరుగుతున్న నిరుద్యోగం, తీవ్రమవుతున్న పోటీ, అవకాశాల అసమాన పంపిణీ, అవినీతి ఆరోపణలు, ప్రభుత్వ వ్యవస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలు ఇప్పటికే యువతలో అసంతృప్తిని పెంచుతున్నాయి. నీట్ పరీక్షా వివాదం ఆ అసంతృప్తికి ఒక స్పష్టమైన రూపాన్ని ఇచ్చింది.

భారతదేశంలో కనిపిస్తున్న ఈ ధోరణి ప్రపంచవ్యాప్తంగా కూడా స్పష్టంగా కనిపిస్తోంది. జెన్-జీ తరం ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కొత్త రాజకీయ శక్తిగా అవతరిస్తోంది. ఈ తరం ఉద్యమాల ప్రత్యేకత ఏమిటంటే, అవి సంప్రదాయ రాజకీయ పార్టీల నాయకత్వంపై ఆధారపడవు. సామాజిక మాధ్యమాలే వీటి ప్రధాన వేదిక. ఒక హ్యాష్‌ట్యాగ్, ఒక వీడియో, ఒక ప్రత్యక్ష ప్రసారం కొన్ని గంటల్లోనే లక్షలాది మంది యువతను ఏకం చేసే శక్తిగా మారుతోంది. ఉద్యమాలు ఇక వీధుల్లో మాత్రమే కాకుండా డిజిటల్ ప్రపంచంలోనూ సమాంతరంగా సాగుతున్నాయి.

గత కొన్నేళ్లలో ప్రపంచంలోని అనేక దేశాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలిచాయి. బంగ్లాదేశ్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా విధానానికి వ్యతిరేకంగా ప్రారంభమైన విద్యార్థి ఉద్యమం చివరకు రాజకీయ మార్పులకు దారితీసింది. కెన్యాలో 2024లో ప్రతిపాదిత ఆర్థిక బిల్లుకు వ్యతిరేకంగా యువత చేపట్టిన రిజెక్ట్ ఫైనాన్స్ బిల్ ఉద్యమం ప్రభుత్వం బిల్లును వెనక్కి తీసుకునే పరిస్థితిని సృష్టించింది. శ్రీలంకలో “అరగలయ” ఉద్యమం ఆర్థిక సంక్షోభం, అవినీతిపై ప్రజా ఆగ్రహానికి ప్రతీకగా నిలిచి అధికార మార్పులకు దారితీసింది. థాయ్‌లాండ్, హాంకాంగ్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం, సెర్బియా, నేపాల్, ఇండోనేషియా, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో అవినీతి, నిరుద్యోగం, ప్రభుత్వ జవాబుదారీతనంపై యువత విస్తృత నిరసనలు చేపట్టింది. ఈ ఉద్యమాలన్నీ ఒకే సందేశాన్ని అందిస్తున్నాయి--- కొత్త తరం కేవలం పాలనను విమర్శించడం కాదు; పారదర్శకత, న్యాయం, సమాన అవకాశాలతో కూడిన వ్యవస్థను కోరుతోంది.

ప్రపంచ ఆర్థిక వేదిక విశ్లేషణల ప్రకారం, డిజిటల్ మాధ్యమాల విస్తరణతో యువత రాజకీయ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఐక్యరాజ్యసమితి అధ్యయనాలు యువతలో ప్రభుత్వాలపై నమ్మకం తగ్గినప్పుడల్లా సామాజిక ఉద్యమాలు వేగంగా విస్తరిస్తాయని సూచిస్తున్నాయి. అందువల్ల ఆధునిక ప్రజాస్వామ్యంలో పాలన అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు; ప్రజల విశ్వాసాన్ని నిరంతరం నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత.

నీట్ పేపర్ లీక్ వివాదం భారతదేశానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల భద్రత, సమాన అవకాశాలు, బాధ్యతాయుతమైన పరిపాలనకు ప్రత్యామ్నాయం లేదు. అదే సమయంలో ప్రపంచ జెన్-జీ తరం ఉద్యమాలు మరో గుణపాఠాన్ని నేర్పుతున్నాయి. యువతను కేవలం నిరసనకారులుగా కాకుండా, విధాన రూపకల్పనలో భాగస్వాములుగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. వారి ఆందోళనలను వినడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, సంస్థలపై విశ్వాసాన్ని పునరుద్ధరించడం ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యంగా మారింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత స్వరం బలపడటం అస్థిరతకు సంకేతం కాదు; వ్యవస్థ సజీవంగా ఉందనడానికి నిదర్శనం. ఆ స్వరాన్ని అణచివేయడం కంటే, సంస్కరణలకు మార్గదర్శకంగా మలచడం సమాజ ప్రయోజనాలకు అనుకూలం. ఎందుకంటే నేటి యువత రేపటి నాయకులు మాత్రమే కాదు; వర్తమానాన్ని ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన సామాజిక శక్తి కూడా.